# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 9 జూన్ 2025 | HYDERABAD


## ఆస్తిపన్ను మార్పులు, చేర్పులకు అవకాశం

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ ) : ఆస్తిపన్ను సేవలను జీహెచ్ఎంసీ మరింత సులభతరం చేసింది. ముఖ్యంగా ఆస్తిపన్ను, స్వీయ అంచనా, ఆస్తిపన్ను సవరణ, మొబైల్ నంబరు మార్పులు, డోర్ నంబర్ సవరణ, యాజమాని పేరు మార్పిడి మొదలైన సేవలకు ఇక మీ సేవాలో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా నేరుగా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. దరఖాస్తుదారుడు తన ఇంటి పీటీఐఎన్ నంబరు, సెల్ డీడ్ అతను పొందాలనుకున్న సేవలకు సంబంధించిన ఇతర అవసరమైన సహాయక పత్రాల ద్వారా WWW.GHMC.GOV.IN ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను పొందవచ్చని కమిషనర్ ఆర్ వీ కర్ణన్ తెలిపారు. దరఖాస్తుదారుడు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో నేరుగా రెవెన్యూ శాఖకు వెళ్లవచ్చని, వాటి పరిశీలన తర్వాత ఆమోదం ఇవ్వబడుతుందన్నారు. ఆస్తిపన్ను మ్యుటేషన్ సేవలు పురోగతి దశలో ఉన్నాయని, ఈ సేవలను త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.



నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం నుంచి చేప మందు పంపిణీ ప్రారంభమైంది. చిత్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించి.. చేప మందు వేసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

IV లో

# జనహృదయ నేతకు కన్నీటి నివాళి

## మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో శోకసంద్రంలో నగరం

సీనియర్ శాసనసభ్యుడిగా, జిల్లా అధ్యక్షుడిగా మాగంటి గ్రేటర్ రాజకీయాల్లో తనదైన ముద్ర

42 ఏండ్ల రాజకీయ రంగంలో ప్రజాసేవే పరమావధిగా జీవితం

అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా భావించిన నాయకుడు

రూ.వేల కోట్ల వ్యయంతో జూబ్లీహిల్స్ అభివృద్ధికి కృషి



సిటీబ్యూరో/బంజారాహిల్స్, జూన్ 8 (నమస్తే తెలంగాణ ) : అభివృద్ధి ఒక్కటే సరిపోదు.. సంక్షేమం కూడా అందరికీ అందాలని నిత్యం తపించే నాయకుడు. 'తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్' సహకారంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి అత్యధిక నిధులు తీసుకువచ్చి, అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా ముందుకు పాలన సాగించిన మాగంటి గోపీనాథ్ జనాన్ని వదిలి.....స్వర్గానికేగినారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి.. ప్రజా ప్రయోజనాల కోసం పరితపించే వ్యక్తిగా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటారు మాగంటి గోపీనాథ్. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు మాగంటికి ఉంది. ప్రజలతో ప్రతి నిత్యం మమేకమై అనేక సమస్యలను పరిష్కరించి, మృధు స్వభావిగా మంచిపేరు తెచ్చుకున్నారు. కులమతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదర్శవంతమైన వ్యక్తిగా తనదైన ముద్ర వేసుకున్నారు.



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావుగౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దాసోజు శ్రవణ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు సంతోష్‌కుమార్, నామా నాగేశ్వరరావు తదితరులు

### ఒకే సారి రాజకీయాల్లోకి వచ్చాం..

మాగంటి గోపీనాథ్ నాకు మంచి మిత్రుడు. ఇద్దరం ఒకే సారి రాజకీయాల్లోకి వచ్చాం. ఎదుటి వారి పట్ల మర్యాదపూర్వకంగా, స్నేహభావంతో మెలిగే గొప్ప వ్యక్తి. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమయ్యే మాగంటి గోపీనాథ్‌ని కోల్పోవడం అత్యంత బాధాకర విషయం.

– సుధీర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే

### మాగంటి మృతి బాధాకరం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చాలా బాధాకరం. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. గోపీనాథ్ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

– తలసాని శ్రీనివాస్ యాదవ్, సనత్ నగర్ ఎమ్మెల్యే

### క్రమశిక్షణకు కట్టుబడి..

పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి.. ప్రజా ప్రయోజనాల కోసం పరితపించే గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్. 42 సంవత్సరాలుగా ఆయనతో స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నా. ప్రజల శ్రేయస్సు, బాగోగుల గురించి నిరంతరం కృషి చేసే వ్యక్తి. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీతో పాటు ప్రజలకు తీరని లోటు.

– మధుసూదనాచారి, ఎమ్మెల్సీ

### మచ్చలేని నాయకుడు

పేద ప్రజల పాలిట సేవకుడు, మచ్చలేని నాయకుడు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్. అంతటి మహనీయుడిని కోల్పోవడం చాలా బాధాకరం. జూబ్లీహిల్స్ లాంటి నియోజకవర్గంలో ధనవంతులతో పాటు నిరు పేదలుండే ఎన్నో బస్తీలు ఉన్నాయి. అలాంటి వారి కోసం నిరంతరం పరితపిస్తున్న ఆయనకు ప్రజలు మూడు సార్లు ఎమ్మెల్యేగా తిరుగులేని ఆధిపత్యాన్ని కల్పించారు. అంతటి గొప్ప నాయకుడిని కోల్పోవడం ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

### అన్ని రంగాల్లోనూ స్నేహితులే

రాజకీయాల్లోనే కాకుండా సినీ, వ్యాపార రంగాల్లో మంచి స్నేహితులను కలిగి ఉన్న మాగంటి గోపీనాథ్‌ను రెండు తెలుగు రాష్ట్రాల్లో అపద్భాంధుగా భావించే వారు ఉన్నారు. మాగంటి గోపీనాథ్..ప్రత్యేకంగా తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. కష్టం అని ఎవరొచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి సమస్యలను పరిష్కరించడంలో దిట్ట. ఒక సారి మనసుకు నచ్చితే స్నేహాన్ని వదులుకోరు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు ఎంతో మంది స్నేహితులున్నారు. రాజకీయ, వ్యాపార, సినీ, పారిశ్రామిక రంగాల్లో ప్రముఖులంతా ఆయనకు సుపరిచితులే.

### కుటుంబ నేపథ్యం

మాగంటి గోపీనాథ్ 1963 జూన్ 2న కృష్ణమూర్తి, మహానంద కుమారి దంపతులకు హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో జన్మించారు. 1980లో వెంకటేశ్వర ట్యుటోరియల్స్ నుంచి ఇంటర్, 1983లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ (బీఏ) పూర్తి చేశారు. ఆయనకు సునీతతో వివాహం జరిగింది. వారికి మాగంటి వాత్సల్యనాథ్ కుమారుడు, అక్షర నాగ, దిశిర అనే ఇద్దరు కుమార్తెలున్నారు. మాగంటి గోపీనాథ్ 1983లో రాజకీయాల్లోకి వచ్చారు.



### అత్యంత బాధాకరం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం అత్యంత బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా.

– బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే

### తీవ్రంగా కలిచివేసింది..

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి రాష్ట్రానికి తీరని లోటు. అనారోగ్యంతో ఆయన మరణించారన్న వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. మాగంటి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా.

–మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

### నిస్వార్థంగా సేవలు

మాగంటి గోపీనాథ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి.. పేద, అణగారిన, మైనారిటీ వర్గాల సంక్షేమానికి నిరంతరం శ్రమించారు. నిస్వార్థంగా సేవలు అందించి స్థానిక ప్రజలు, కార్యకర్తలు, అభిమానుల మన్ననలను పొందారు. ఆయన కుటుంబసభ్యులు, అభిమానులకు ప్రగాడ సానుభూతిని తెలియజేస్తున్నా.

– పద్మారావుగౌడ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే

## ఇక మాకు దిక్కెవరు..?

కన్నీటి పర్యంతమైన బోరబండ వాసులు

కాంగ్రెస్ నేతల అరాచకాలపై మండిపాటు

IV లో



## కార్యకర్తలంటే పంచ ప్రాణాలు

సర్దార్ ఆత్మహత్యను తట్టుకోలేకపోయిన మాగంటి దిగులుతో సరిగా భోజనం చేయక నీరసించి ప్రాణాల మీదకు..

IV లో

# మరోసారీ!



- మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు నిరాశే
- ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లిన అధిష్ఠానం
- అమాత్యా యోగం దక్కలేదని.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి అలక
- ఇరువురికి పార్టీ హైకమాండ్ బుజ్జగింపు

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చోటు లభించకపోవడంతో ఆశావహులు తీవ్ర నిరాశకు గురయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి మంత్రివర్గ విస్తరణలోనే ఈ రెండు జిల్లాలకు స్థానం లభిస్తుందని ఎంతో ఆశపడ్డారు. రెండోసారైనా తమకు అవకాశం లభిస్తుందని ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసి ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది. అలక వహించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీని కాంగ్రెస్ అధిష్ఠానం బుజ్జగిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ తీరాలకు చేర్చాలంటే మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఎంతో ఆశించామని వారు పేర్కొంటున్నారు. – రంగారెడ్డి, జూన్ 8 (నమస్తే తెలంగాణ) :

తెలంగాణకు గుండెకాయలాంటి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మం త్రివర్గ విస్తరణలో చోటు దక్కలేదు. మంత్రి పదవిపై ఆశలు పెంచుకున్న పలువురు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. అమాత్యా యోగం దక్కకపోవడంతో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నారు. బుజ్జగించేందుకు ఆదివారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తదితరులు ఆయన ఇంటికెళ్లారు. మంత్రి పదవి కోసం ఆయన ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఢిల్లీ స్థాయిలోనూ పైరవీలు చేశారు. మంత్రివర్గంలో స్థానం లభించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని గతంలో ప్రకటించారు. మంత్రివర్గంలో స్థానం కోసం కులమే అడ్డు అనుకుంటే రాజీనామా చేసి బడుగు, బలహీన వర్గాలనైనా గెలిపిస్తానని అధిష్ఠానానికి అల్టిమేటం ఇచ్చారు.

### బల్మూర్ వెంకట్‌కూ నిరాశ

హైదరాబాద్ నుంచి మంత్రివర్గంలో స్థానం కోసం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా తీవ్రంగా పైరవీలు చేశారు. మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని ఆశించగా.. ఆయన ఆశలు కూడా ఫలించలేదు.

### మరోసారి ఆశాభంగం

మొదటి మంత్రివర్గ విస్తరణలోనే తనకు స్థానం లభిస్తుందని మల్‌రెడ్డి రంగారెడ్డి ఎన్నో ఆశలు పెట్టుకున్నా అవకాశం లభించలేదు. మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చిన ప్రతి సారీ ఆయన ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి ద్వారా ప్రయత్నాలు చేశారు. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో స్థానం దక్కుతుందని అందరూ ఊహించగా అనూహ్యంగా ఆయన పేరు జాబితాలో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.



### రెండు జిల్లాలపై కనికరం చూపని కాంగ్రెస్

గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. రంగారెడ్డి జిల్లాలోనూ ఎక్కువ మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే విజయం సాధించారు. కాంగ్రెస్ ఈ రెండు జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదనే ఆరోపణలున్నాయి. రంగారెడ్డి జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్‌సిటీ, ఇతర పరిశ్రమలు, ఐటీ సంస్థలు వస్తున్నా జిల్లాకు మంత్రివర్గంలో స్థానం దక్కడంలేదు. గ్రేటర్ హైదరాబాద్‌లో గత బీఆర్ఎస్ హయాంలో నలుగురు మంత్రులుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మంత్రికి కూడా స్థానం కల్పించలేదు. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయలాంటి ఈ రెండు జిల్లాలను కాంగ్రెస్ విస్మరిస్తున్నదనే ఆరోపణలున్నాయి.

# తొలగని భూ గ్రహణం

ఆరు నెలలు గడిచినా భూసేకరణ కాలే

## ఓల్డ్ సిటీ మెట్రోకు భూములిచ్చేందుకు అనాసక్తి

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా శంకుస్థాపన చేసిన ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణకు భూ సేకరణ చిక్కులు తొలగడం లేదు. మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, కూల్చివేతలు ప్రారంభిస్తామని ప్రకటించినా... క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు ముందుకు సాగడం లేదు. పరిహారం విషయంలో మొదలైన సమస్యలు ఇంకా జటిలమైతూనే ఉన్నాయి. దీంతో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఉన్న 7.5 కిలోమీటర్ల పొడవైన మెట్రో కోసం ఆస్తుల సేకరణ ఓల్డ్ సిటీలో నత్తనడకన సాగుతోంది. రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓల్డ్ సిటీ మెట్రోకు ఇంకా భూసేకరణ చిక్కులు పరిష్కారం కావడం లేదు. కొంత కాలంగా భూసేకరణలో ఎదురైన ఇబ్బందులతో ప్రాజెక్టు నిర్మాణం నిలిచిపోగా... తాజాగా మెట్రో పొడవును పెంచి చాంద్రాయణగుట్ట వరకు పొడిగించినా... క్షేత్ర స్థాయిలో ఉన్న పురాతన, చారిత్రక కట్టడాలు ప్రధాన ఆటంకంగా మారుతుండగా.... ప్రైవేటు భూముల విషయంలోనూ కొందరు బాధితులు కోర్టులను ఆశ్రయించారు. దీంతో మొత్తంగా గుర్తించిన 900 ఆస్తుల్లో ఇప్పటివరకు 220 వాటికే పరిహారం చెల్లించినట్లు మెట్రో వెల్లడించింది. కానీ మిగిలిన ఆస్తుల సేకరణ ఎప్పటి లోగా పూర్తవుతుందనేది ఇప్పటికీ ప్రశ్నార్థకమే.

### ఆరు నెలలు గడిచినా... అదే పరిస్థితి

ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ విషయంలో న్యాయపరమైన చిక్కులే ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఓవైపు ప్రభుత్వ యంత్రాంగం భూ యజమానులతో చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడమే ఇప్పుడు ప్రాజెక్టులో పురోగతి లేకుండా చేస్తుంది. ఇక నోటిఫై చేసిన ఆస్తులన్నింటినీ సేకరించేలా... పరిహారం అందజేసిన ఆస్తులను అప్పటికప్పుడు కూల్చివేస్తున్నారు. కానీ భూ యజమానుల నుంచి ఆశించినంత స్పందన రావడం లేదు. దీంతో ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేకుండా పోతున్నది. ఇప్పటికే డీపీఆర్‌ను కేంద్రానికి చేరగా... అక్కడి నుంచి అనుమతులు వచ్చేలోపు భూసేకరణ పూర్తి చేస్తే తప్ప.. ప్రాజెక్టు వచ్చే మూడేళ్లలో అందుబాటులోకి వచ్చే వీలు ఉండదు.





### మృగశిర సందడి

మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం నగరంలోని ముషీరాబాద్ చేపల మార్కెట్ కిటకిటలాడింది. ఉదయం నుంచే కొనుగోలుదారులు మార్కెట్‌కు చేరుకోవడంతో రద్దీ నెలకొంది.

### గ్రేటర్ @ 37.5

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. మొన్నటి వరకు అడపాదడప కురిసిన వానలతో కొంత చల్లబడిన నగరం ఉష్ణోగ్రతలు.. సాధారణ స్థాయి దాటి నమోదవ్వడంతో మరోసారి వేడెక్కింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 37.5, కనిష్ఠం 25.6 డిగ్రీలు, గాలిలో తేమ 45 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా రాగల రెండు రోజులు గ్రేటర్‌లో మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.